అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 29 జనవరి 2023

కలెక్టర్ కార్యాలయం పక్కన అగ్నిప్రమాదం

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం పక్కన ఒకసారిగా మంటలు ఎగిసిపడంతో అధికారులు ఆందోళనకు గురైయ్యారు. ఈ మంట ఎక్కడినుంచి వస్తుందని అధికారులు చూడడంతో గుడి అంటుకుంటుందని అధికారులు 101కి ఫోన్ చేయడంతో ఫైర్స్ సిబ్బంది అక్కడికి వచ్చి మంటలు ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కార్యాలయం పక్కన ఆహ్లాదకరంగా ఉండడానికి మొక్కలు నాటారు. ఆ మొక్కలు ఏపుగా పెరగడంతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చే సిబ్బందికి గాని ప్రజలకు గాని నీడనిస్తున్నాయి. మధ్యలో గడ్డి ఎండిపోవడంతో ఎవరో వ్యక్తులు చెత్తను అంటిపెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి.

ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-వర్ని

రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామంలో గల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6 తరగతిలో ప్రవేశాలకు అడ్మిషన్‌లు ప్రారంభించినట్టు ప్రిన్సిపల్ నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 5వ తరగతి పూర్తి చేసుకుని ఆరవ తరగతిలో ప్రవేశించి వారు దగ్గర్లోని మీసేవ సెంటర్‌లలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో 100 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే 7 ,8, 9, 10 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, ఏప్రిల్ 16వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు.

నిరంతర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- నగరాభివృద్ధికి ఎనిమిదేండ్లలో రూ.936 కోట్ల ఖర్చు
- రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- ఆర్‌యూబీ ప్రారంభం.. కళాభారతి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఆర్‌యూబీని ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, వేముల, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖ మంత్రి కే. తారకరామారావు అన్నారు. గడిచిన ఎనిమిదిన్నరేళ్ల కాలంలో ఒక్క నిజామాబాద్ నగర అభివృద్ధికే ప్రభుత్వం రూ.936 కోట్లు ఖర్చు చేసిందని, ఇంకనూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు అనేకం ఉన్నాయని వెల్లడించారు. మరో నెలన్నర రోజుల్లో పూర్తి కానున్న ఐ.టీ హబ్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేసేందుకు తాను మళ్ళీ నిజామాబాద్‌లో పర్యటిస్తానని అన్నారు. శనివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. రూ.22 కోట్లతోకంఠేశ్వర్ కమాన్ వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. పాత కలెక్టరేట్ వద్ద రూ.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఇందూరు కళాభారతి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన కాకతీయ సాండ్ బాక్స్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఇందూరు కళాభారతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో నిజామాబాద్ జిల్లా ముందువరుసలో నిలుస్తూ యావత్ తెలంగాణకు మార్గదర్శకంగా నిలిచిందని గుర్తు చేశారు. అందుకే నిజామాబాద్ జిల్లా అంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకమైన అభిమానమని అన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి ఇటీవలే సమీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని అన్నారు. ఇందులో భాగంగానే కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, బాలలు, అన్ని వర్గాల ప్రజలకు చక్కటి కానుక అందించేలా ఇందూరు కళాభారతి నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా అన్ని హంగులు, అధునాతన వసతులతో అలరారేలా కళాభారతి డిజైన్ రూపొందించడం జరిగిందన్నారు. గడిచిన ఎనిమిదిన్నరేళ్ల కాలంలో ఒక్క నిజామాబాద్ నగర అభివృద్ధికే ప్రభుత్వం రూ.936 కోట్లు ఖర్చు చేసిందని, ఇంకనూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు అనేకం ఉన్నాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మరో నెలన్నర రోజుల్లో పూర్తి కానున్న ఐ.టీ హబ్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేసేందుకు తాను మళ్ళీ నిజామాబాద్‌లో పర్యటిస్తానని అన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిపేందుకు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖా మంత్రి కే. తారకరామారావు కు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా ఉదయం 9.30 గంటలకు మంత్రి కేటీఆర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్నారు. రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల శాసనసభ్యులు జీవన్ రెడ్డి, షకీల్ ఆమీర్ మంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో వచ్చారు. హెలిప్యాడ్ వద్ద రాజ్యసభ సభ్యులు కే.ఆర్.సురేష్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రావు, వి.గంగాధర్ గౌడ్, రాష్ట్ర మహిళా సహకార సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలిత, మేయర్ దండు నీతూకిరణ్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, పోలీస్ కమిషనర్ కేఆర్.నాగరాజు, అదనపు కలెక్టర్ లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మార్కుఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్ తదితరులు కేటీఆర్ ను కలిసి పూల మొక్కలు, బొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. భూమారెడ్డి కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ సాండ్ బాక్స్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ మంత్రి కేటీఆర్ పర్యటన కొనసాగింది.



హెలిక్యాప్టర్‌లో కేటీఆర్ వెంట మంత్రి వేముల, ఎమ్మెల్యేలు షకీల్, జీవన్‌రెడ్డి..



మంత్రికి స్వాగతం పలుకుతున్న అర్బన్ ఎమ్మెల్యే



కళాభారతికి శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న మంత్రి

పోలీసుల డేగ కన్ను



మంత్రి పర్యటన నేపథ్యంలో సీపీ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని ఎక్కడికక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. రెండు గంటల పర్యటన అనంతరం మంత్రి తిరిగి వెళ్లిపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీపీ నాగరాజు, పోలీసులు

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

వర్క్‌సైట్ స్కూల్ ప్రారంభించిన డీఈవో



స్కూల్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న డీఈవో రాజు

నవతెలంగాణ-లింగంపేట్

బడి ఈడు పిల్లలు బడిలోనే కచ్చితంగా ఉండాలని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. లింగంపేట్ మండలంలో ముస్తాపూర్ గ్రామంలో ఇటుక బట్టీలలో పని చేసే పిల్లల కోసం ప్రత్యామ్నాయ పాఠశాల (వర్క్ సైట్ స్కూల్)ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. విద్య హక్కు చట్టం ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలు కచ్చితంగా బడిలో ఉండాలని చెప్పారు. ముస్తాపూర్ గ్రామంలో ఇటుక బట్టీల దగ్గర పనిచేయటానికి మహారాష్ట్ర నుండి వలస వచ్చినటువంటి కుటుంబాలలో గల పిల్లలను ఓఎస్సీ సర్వేలో భాగంగా సిఆర్పిలు గుర్తించారని, వారి చదువులు మధ్యలో ఆగొద్దనే ఉద్దేశ్యంతో ప్రత్యామ్నాయ పాఠశాలను ప్రారంభించి చదువు చెప్తామని తెలిపారు. జిల్లాకు వివిధ రాష్ట్రాల నుండి, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారికి కోసం ఇలాంటి స్కూళ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి వేణు గోపాల్ శర్మ, మండల విద్యాధికారి రామస్వామి, స్థానిక ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రావు, సిఆర్పిలు సంజీవులు, విజయ్, విద్యా వాలంటరీ సౌందర్యతో పాటు ఇటుక బట్టి యజమానులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల ఉపాధ్యక్షులు యోగేష్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు శనివారం పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం పెట్టాలని నిర్వహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనం అందుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠ్యాంశాలపై విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వారి వెంట ఉప సర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, మేక సంతోష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు, అడ్డగింతలు

- ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు
- మంచిప్పలో పోలీస్ పికెట్
- మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్/మోపాల్



ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్ట్..



కాన్వయ్‌ను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కాగా మంచిప్ప భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టకుండా ఆ గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించారు.

పర్యటనపై అంత భయమెందుకు..? : ఎస్ఎఫ్ఐ

అక్రమ అరెస్టులు చేయడమంటే కేటీఆర్ విద్యార్థులకు భయపడడమే అని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ తో పాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని, జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినందుకు తమను అరెస్ట్ చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలను 3000 వేలకు పెంచాలని పెండింగ్‌లో ఉన్న ఫీ రియింబర్స్‌మెంట్‌లను విడుదల చేయక పోవడంతో చదువులు ఎలా ముందుకు సాగుతాయని ప్రశ్నిం చారు. అదేవిధంగా మన ఊరు మనబడి పథకం కింద అన్ని పాఠశాలలను అభివృద్ధి పరిచి ఆంగ్ల విద్యా బోధనను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గోడు వెళ్లబోసుకోనివ్వలే.. మంచిప్పలో పోలీస్ పికెట్

మంత్రి కేటీఆర్‌కు కనీసం తమ గోడును వెళ్లబోసుకోనివ్వడానికి కూడా అవకాశం ఇవ్వలేదని మంచిప్ప భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో మంచిప్పలో పోలీస్ పికెట్ నిర్వహించారు. భూ నిర్వాసితులెవరినీ ఊరు దాటి వెళ్లనీయకుండా ఎక్కడిక్కడ బందోబస్తు చేపట్టారు. పాత డిజైన్ ప్రకారమే కొండెం చెరువు రిజర్వాయర్ నిర్మించాలని మంత్రికి వినతిపత్రం ఇద్దామని భావించినా పోలీసులు అడ్డుకున్నారని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాలో మంత్రి కాన్వాయ్‌ను కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్‌తో పాటు కొంతమంది ఎన్ఎస్‌యూఐ నాయకులు అడ్డుకునేందుకు యత్నించగా.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నల్లజెండాలతో ఎదురుగా వచ్చి కేటీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

టీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్తుండగా.. ఎల్లమ్మ గుట్ట చౌరస్తా వద్దబీజేపీ కార్పోరేటర్ ఎర్రం సుధీర్, బీజేవైఎం నాయకులు ఆకాష్‌తో పాటు మరికొంత మంది ఆందోళన చేపట్టాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ కాన్వయ్‌ను అడ్డుకునే యత్నం చేశారు.

పైరవీ బదిలీలు ఆపాలి

- జీరో సర్వీస్ బదిలీలకు అనుమతి ఇవ్వాలి
- ఎస్జీటీ, స్పౌజ్ బదిలీలు చేపట్టాలి
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల పైరవీ బదిలీలు ఆపాలని, జీరో సర్వీస్ బదిలీలకు అనుమతి ఇవ్వాలని ఎస్‌జిటి ఎల్ స్పౌజ్ బదిలీలను చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా శాఖ సభ్యులు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, టిపిటిఎఫ్ సత్యనారాయణ, డిటిఎఫ్ రాజన్న, ఎస్సీ ఎస్టీ యూఎస్ సుధాం, టి ఎస్ పి టి ఏ వెంకటరమణ మాట్లాడారు. రాజకీయ పలుకుబడితో చేస్తున్న వందలాది పైరవీ బదిలీలు నిలుపుదల చేయాలని, బదిలీల్లో కనీస సర్వీసు నిబంధనను తొలగించాలని, మిగిలిన ఎస్జీటీ, ఎల్పీ స్పౌజ్ బదిలీలను నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పీసి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాలేదని అన్నారు. అక్రమాలకు తావులేకుండా బదిలీలు పారదర్శకంగా జరపాలని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో సూచించినా ప్రభుత్వమే పైరవీ బదిలీలకు తెరలేపడం సరికాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు హామీ ఇచ్చిన విధంగా పైరవీ బదిలీలు నిలివేసి, ఉపాధ్యాయులు అందరికీ బదిలీల్లో పాల్గొనే అవకాశం ఇచ్చి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కౌలాస్ మఠం నిర్మాణానికి ఎమ్మెల్యే పది లక్షలు విరాళం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-జుక్కల్

మండలం లోని కౌలాస్ గ్రామంలో మఠం నిర్మాణానికి గ్రామస్తుల కోరిక మేరకు రూ.10 లక్షలు విరాళం గా అందజేస్తానని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే హామీ ఇచ్చారు. కౌలాస్ గ్రామంలో రథ సప్తమి వేడుకలను సర్పంచ్ గొల్లహన్మండ్లు ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెలే హన్మంత్ షిండే, వైస్ ఎంపిపి ఉమాకాంత్ దేశాయి పాల్గొన్నారు. ముందుగా బసవలింగ శివాచార్య ఆశీర్వచనం తీసుకున్నారు. ఎమ్మెలేను మఠాదీపతిని సన్మానించారు. ఎమ్మెలే షిండే మాట్లాడుతూ కౌలాస్ గ్రామస్తుల కోరిక మేరకు మఠం నిర్మాణానికి రూపాయలు పది లక్షలు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మల్యాద్రిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై అనుచిత వాఖ్యాలు చేసినందుకు శ్రీనగర్ టీఆర్ఎస్ యువజన నాయకుల ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడైన మల్యాద్రి రెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. మల్యాద్రిరెడ్డి వెంటనే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. లేని పక్షంలో మల్యాద్రిరెడ్డిని బాన్సువాడ నియోజకవర్గంలో తిరగనియ్యబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టిల్లు, శ్రీనగర్ సర్పంచ్ రాజు, పెయింటర్ రామ్‌చందర్, మేకల దొడ్డి గణపతి, జెమిగే రాజు, తోరం శరత్, చింతాకి మారుతి తదితరులు పాల్గొన్నారు.

హిందీ విభాగంలో అశోక్ చౌహాన్‌కు డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో హిందీ విభాగంలో పరిశోధక విద్యార్థి అశోక్ చౌహాన్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. దీనికి సంబంధించిన ఓపెన్ వైవా-వోస్ (మౌఖిక పరీక్ష)ను శనివారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ వైవాలో ఆర్ట్స్‌డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య, పాఠ్యప్రణాళికా సంఘం చైర్మన్ డాక్టర్ యండి.జమీల్ అహ్మద్, డాక్టర్ నారాయణ అసోసియేటెడ్ ప్రొఫెసర్ తదితరులు హాజరయ్యారు.

అపర భగీరథులు..
చేతిపంపు మెకానిక్‌లు..

- 2014లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నుంచి చేతిపంపు మెకానికులకు బడ్జెట్ నిలిపివేత
- తమ ఉద్యోగాల కోసం ఏడేళ్లుగా కోర్టులో పోరాటం
- ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టు ఆదేశం
- ప్రభుత్వానికి రెండు నెలల గడువు ఇచ్చిన హైకోర్టు
- హైకోర్టు తీర్పుపై చేతిపంపు మెకానిక్‌ల హర్షం..

నవతెలంగాణ-నవీపేట్

దశాబ్ద కాలం క్రితం ప్రజల దహార్తిని తీర్చడంలో కీలకపాత్ర వహించిన చేతిపంపు మెకానిక్‌లు తమ ఉద్యోగాల రెగ్యులరైజ్ కోసం అపర భగీరథులుగా హైకోర్టులో ఏడేండ్లుగా పోరాడడంతో వారిని ట్రిబుల్ ఐస్ చేయాలని హైకోర్టు తీర్పునివ్వడంతో వారిలో హర్షం వ్యక్తం అవుతుంది.

గత పది సంవత్సరాల క్రితం ప్రజల దాహార్తిని తీర్చడంలో భగీరథ పాత్రపోషించిన చేతి పంపు మెకానిక్‌లు విద్యుత్ మోటార్లు రావడంతో వీరికి పని లేకుండా పోయింది. అంతేకాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ పనులను పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్వహించడం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మండల పరిషత్‌లో తాగునీటి శాఖ ఆర్‌డబ్ల్యూఎస్‌లో 1989 నుంచి 95 వరకు భర్తీ కాబడి నామినల్ మాస్టర్ రూల్ ద్వారా రోజువారీగా 500 కనీస వేతనంతో పనిచేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడంలో వీరు అలుపెరుగని శ్రామికులుగా పనిచేశారు. వృత్తిలో భాగంగా ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోకపోయినా ప్రజల నేటి అవసరాలను తీర్చేందుకు భగీరథులుగా కృషి చేశారు. విద్యుత్ మోటార్‌లు రావడం గ్రామాల్లో చేతిపంపుల వాడకం పూర్తిగా తగ్గిపోవడం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు నిలిపివేయడంతో వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండలానికి ఒకరి చొప్పున సుమారు 500 మంది చేతిపంపు మెకానిక్‌లు పనిచేస్తుండగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, అధికారులు తమ బాధ్యత కాదని ఎవరి దారి వారు చూసుకోవాలని చెప్పడంతో 90 శాతం మెకానిక్‌లు తమ భవిష్యత్తు భద్రత లేదని భావించి ఇతరత్రా పనులు చేసేందుకు వెళ్లిపోయారు. తెలంగాణ లోని 31 మంది మెకానిక్‌లు 20 సంవత్సరాలుగా ప్రజలకు సేవ అందిస్తూ పనిచేసిన తమను అర్ధాంతరంగా బడ్జెట్ కేటాయింపులు నిలిపివేయడం పట్ల 2015 జనవరిలో హైకోర్టును ఆశ్రయించారు.

ఐదేళ్లు ఉచిత సేవలు..

2015 నుంచి 2020 వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వేతనాలు తీసుకోకుండా మండల కార్యాలయాల్లోనే తెలంగాణ రాష్ట్రంలో 31 మంది చేతిపంపు మెకానికులు విధులు నిర్వహించారు. 2020లో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి తాత్కాలికంగా వేతనాలు ఇవ్వాలని తెలపడంతో ప్రభుత్వం కనీస వేతనం రూ.13,000 పంచాయతీరాజ్ శాఖ ద్వారా చెల్లిస్తుంది.

హైకోర్టు తీర్పుపై హర్షం..

తమ విధులను పునరుద్ధరించాలని 31 మంది మెకానికులు హైకోర్టును ఆశ్రయించి భగీరథ ప్రయత్నం చేయడంతో హైకోర్టు వీరిని రెగ్యులైజ్ చేయాలని డిసెంబర్ 9, 2022న ఆదేశాలు ఇవ్వగా జనవరి 1, 2023 న అధికారిక ఉత్తర్వులు వెలుపడ్డాయి. 2015లో మొత్తం 31 మంది మెకానిక్‌లలో వేరువేరుగా నాలుగు పిటిషన్లను న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదించగా న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద విచారించి వీరి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి రెండు నెలల గడువు నిచ్చింది. దీంతో 31 మంది మెకానిక్‌లు అపర భగీరథ ప్రయత్నం చేశారని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వం సైతం వీరి సేవలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.



సేవలను సీఎం కేసీఆర్ గుర్తించాలి



దశాబ్దాలుగా చేతి పంపు మెకానిక్‌లు ప్రజలకు చేసిన సేవలను ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించి తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసేందుకు కృషి చేయాలి. హైకోర్టు ఇచ్చిన రెండు నెలల్లోగా తమకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలి.

- హైమద్, చేతిపంపు మెకానిక్, నవీపేట్

క్రమబద్ధీకరణకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి



గతంలో చేతిపంపు రిపేర్‌ల సమయంలో ప్రమాదాలకు గురై ఒకరు ప్రాణాలు కోల్పోగా ఇప్పటికీ కొందరు అనారోగ్యంతో మంచాన బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తాము చేసిన సేవలను గుర్తించి ఉద్యోగాల క్రమబద్ధీకరణకు కృషి చేయాలని కోరుతున్నాం.

- హన్మండ్లు, చేతి పంపు మెకానిక్, నందిపేట్

మామ అవమానించాడని
అల్లుడి ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్



సందీప్ (ఫైల్)

మామ అవమా నించాడని అల్లుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోలీస్ స్టేషన్ పరిధిలోని యంచ గోదావరిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఉప్పుగూడకు చెందిన ఆర్థం సందీప్(30) తన భార్య ప్రియ చెల్లెలు మరదలు వివాహానికి ఈనెల 26వ తేదీన నిజామాబాద్‌కు వచ్చారు. పెళ్లి అనంతరం సందీప్ మామ కొండా నాగేందర్ డబ్బుల విషయంలో అసభ్య పదజాలంతో దూషించి అందరి ముందు అవమానించడంతో మనస్థాపం చెంది శనివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై యంచ గోదావరికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు అతని స్నేహితులకు తన మామ తనను అవమానించాడని వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాడని తన కుమారుడి మృతికి మామ నాగేందర్ కారణమని మృతుడి తండ్రి మనోహర్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మృతుడికి రెండున్నర సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫకీరాబాద్ గ్రామంలో బట్టు నీల (45) ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన బట్టు శంకర్ రోజులాగే పనికి వెళ్లగా అతని భార్య బట్టు నీల ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

నవతెలంగాణ-కోటగిరి

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతిచెందారు. మండల కేంద్రంలోని పోచారం కాలనీలో నివసించే ముఖేడ్ రాములు (42) ఈ నెల 25 రాత్రి సమీపంలోని దామర చెరువులో చేపల వేటకు వెళ్లి శనివారం ఉదయం శవమై కనిపించడంతో పోచారం కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కోటగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్థిక సహాయం అందజేసిన ఎంపీపీ భర్త శ్రీనివాసరావు

మృతుడు పేద పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని దాహన సంస్కారాల నిమిత్తం బీఆర్ఎస్ నాయకులు, ఎంపీపీ సునీత భర్త శ్రీనివాసరావు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ స్వరూప చేతుల మీదుగా కుటుంబ సభ్యులు అందజేశారు.

బట్టాపూర్‌లో ఇసుక డంప్‌ల సీజ్

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలంలోని బట్టాపూర్ శివారు నందు 28 ట్రిప్పుల ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు ఏర్గట్ల ఎమ్మార్వో జనార్ధన్ తెలిపారు. పట్టుకున్న ఇసుకను డబుల్ బెడ్ రూమ్ పనులకు తరలించినట్లు తెలిపారు. గత రెండు రోజుల క్రితం 45 ఇసుక డంప్‌లను సీజ్ చేయగా శనివారం తాజాగా 28 ట్రిప్పుల ఇసుక సీజ్ చేశారు. అనుమతి లేనిదే ఇసుక తరలిస్తే కేసులు నమోదుచేస్తామని ఎమ్మార్వో తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు..

- ఒకరి మృతి, ఇంకొకరికి గాయాలు
- టోల్‌ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆగిఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఒకరి మృతిచెందారు. ఇంకొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఇందల్‌వాయి టోల్‌ప్లాజా 44వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామానికి చెందిన అంది నగేష్ (35) అనే వ్యక్తి తన తమ్ముడు నవీన్ దుబాయ్ వెళ్లాల్సి ఉండటంతో అతడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వదిలివెళ్లేందుకు నగేశ్ భార్య నదియా, స్నేహితుడు వెంకటేష్‌గౌడ్‌తో కలిసి కారులో వెళ్లారు. నవీన్‌ను వదిలి తిరిగి స్వగృహానికి వస్తుండగా మార్గమధ్యంలోని ఇందల్‌వాయి టోల్‌ప్లాజా దాటగానే కొంతదూరంలో పార్క్ చేసి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నగేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని టోల్ ప్లాజా హైవే అంబులెన్స్‌లో నగేష్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అయన మృతి చెందాడు. కారు నడుపుతున్న వెంకటేష్ గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నగేష్ మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించారు. గాయాల పాలైన వెంకటేష్ గౌడ్‌ను ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. మృతుడి భార్య నదియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన నగేష్

30న ఛలో ఎస్‌పీడీ కార్యాలయం

- పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మాక్లూర్

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్‌కు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 30న జరిగే చలో ఎస్‌పీడీ కార్యాలయం పిలుపును జయప్రదం చేయాలని కేజీబీవీ మాక్లూర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ఆరోగ్య, ఉద్యోగ భద్రత పథకాలు అమలు కావడం లేదన్నారు. గత 16 సంవత్సరాలుగా తీవ్ర పనిభారంతో విధులు నిర్వహిస్తూ అనారోగ్యాలకు గురయ్యారన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి మెడికల్ ఇన్సూరెన్స్, ఆరోగ్య భద్రత లేదన్నారు. కనీస వేతనాలు అమలు కాకపోవడంతో శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. పని భారం పెరిగినా ఖాళీలు భర్తీ చేయడం లేదన్నారు. కేజీబీవీల్లో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. తక్షణమే జీవో నెంబర్ 60ని అమలు చేయాలని, కేజీబీవీలో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలని, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో కుక్, స్వీపర్, అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కంప్యూటర్, ఒకేషనల్ ట్రైనర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలన్నారు. ఏ.ఎన్.ఎంల నైట్ డ్యూటీలను 3 రోజుల నుంచి ఒక రోజుకు తగ్గించాలన్నారు. అకౌంటెంట్లకు బదిలీలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. చనిపోయిన వారి కుటుంబానికి 10లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనలో భాగంగా ఈనెల 30న హైదరాబాదులోని స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఎస్పీడీ) కార్యాలయం ముందు యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది మోతి, రమ, శారద, సువర్ణ, ఆండాలు, శారద, చంద్రకళ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బీఆర్ఎస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్లు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు సొసైటీకి చెందిన ఇద్దరు బీజేపీ పార్టీ డైరెక్టర్లు శనివారం వారి 52 మంది అనుచరులతో శనివారం రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే వారికీ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన డైరెక్టర్లు కల్లెడ చిన్న గంగాధర్, కల్లెడ వసంత రమేష్ మాట్లాడుతూ.. బీఆర్టీఎస్ ప్రభుత్వ హయాంలో రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తాము ఆకర్షితులై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. వీరితోపాటు పార్టీలో చేరిన వారిలో యువజన నాయకుడు చందు, ప్రశాంత్, విక్కీ, నరేష్, వినయ్, భూమా రెడ్డి, గంగారెడ్డి, హనుమండ్లు, శ్రీధర్‌గౌడ్, అఖిల్, నిఖిల్, ఫణి కుమార్, నర్సారెడ్డి, ఇతర యువకులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, హన్మంత్ రెడ్డి, దారావత్ గోపాల్, రామలింగారెడ్డి తదితరులున్నారు.



మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై
ఏప్రిల్ 5న చలో పార్లమెంట్

- సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపు



మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న కార్మిక, కర్షక ఐక్య వేదిక ఆధ్వర్యంలో చలో పార్లమెంట్‌కు లక్షలాదిమంది కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం హిందుత్వ వాదంతో కార్మికుల మధ్య కులం మతం చిచ్చులేపి కార్మికుల మధ్య చీలికలు తెచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తుందని విమర్శించారు. ఏప్రిల్ 5న పార్లమెంట్ ముట్టడితో మోడీ ప్రభుత్వం మునిగిపోతుందని ఆయన అన్నారు. దేశంలో కోట్లాది మంది స్కీమ్ వర్కర్లు సమాజ సంక్షేమం కోసం పని చేస్తున్నారని, వారికి కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టి చాకిరి చేయించుకుంటూ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని వారికి కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ, చక్రపాణి, కోశాధికారి పి.స్వర్ణ, సహాయ కార్యదర్శి గోవర్ధన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికిన బోధన్ ఎమ్మెల్యే షకీల్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ నగర కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న ఇందూర్ కళాభారతి ఆడిటోరియం శంకుస్థాపనకు శనివారం విచ్చేసిన పట్టణ అభివృద్ధి శాఖ, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు బోధన్ ఎమ్మెల్యే షకీల్ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి, బోధన్ ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ సాలురా షకీల్, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి ఉన్నారు.

గన్నారంలో శ్రీ నవనాథ్ సిద్దేశ్వర స్వామి వార్షికోత్సవం




వేడుకల్లో గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలో శ్రీ నవనాథ్ సిద్దేశ్వర స్వామి 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా జాతర నిర్వహించారు. ప్రతి ఏటా గ్రామంలోని పద్మశాలీల ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పద్మశాలీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చిలువెరి దాస్, సామల రాజేశ్వర్‌లు తెలిపారు. కార్యక్రమంలో మంగళపల్లి లక్ష్మణ్, తళ్ళ రాజు, సామల గంగనర్సయ్య, మహేశ్వరాములు, గుండ సుదర్శన్, దోమల రాజన్న, కరంపూరి విక్కీ, బొధుల నవీన్, పద్మశాలి కుటుంబ సభ్యులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

- ఎంపీడీవో శంకర్



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం పాఠశాలలోని పనులను ఈ నెలాఖరు లోపల పూర్తి చేయాలని ఎంపీడీవో శంకర్ ఆదేశించారు. మన ఊరు మన పాఠశాలలో భాగంగా మంజూరైన నిధులతో పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన అన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
ఆదివారం 29 జనవరి 2023

దర్గా వద్ద ప్రత్యేక పూజలు



టీడీపీ నాయకుల పూజలు

నవతెలంగాణ-లింగంపేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేయనున్న యువకులం పాదయాత్ర కావాలని శనివారం లింగంపేట మండలంలోని భవానిపేట్ మంబోజి పేట గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు భవానిపేట గ్రామ సమీపంలోని సాహెబ్ దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు బోయిని రాజు, అరుణ్, విజయ్ పాల్గొన్నారు.

రైతులకు నీటి గొట్టాల పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి గ్రామంలో కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో పద్మపాని స్వచ్ఛంద సంస్థ సభ్యులు రైతులకు సొసైటీ చైర్మన్ వల్లకొండ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నీటి గొట్టాలని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి గొట్టాలను ఉపయోగించి ప్రతి రైతు తడి పొడి విధానం ద్వారా వరి పంటలో నీటిని చూసుకోవడానికి సులువుగా ఉంటుందని, రైతులు తమ వరి పంటలో తడి పొడి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ భగవంతు రెడ్డి, ఎంపీటీసీ మంజుల సంజీవరెడ్డి, రైతుబంధు కన్వీనర్ గంగారెడ్డి, డిస్టిక్ కోఆర్డినేటర్ రాజేందర్, మండల కోఆర్డినేటర్ మనోజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

స్కూళ్లకు బీరువా, బ్యాగులు వితరణ



దోన్గాం ఎంపీపీఎస్ పాఠశాలకు బీరువా వితరణ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఎంపీపీఎస్ శక్తినగర్, డోన్గాం పాఠశాలలో స్కూల్ బ్యాగులు, బీరువాను వితరణ చేసినట్టు హెచ్ఎంలు విఠల్, హరిక తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎంలు మాట్లాడుతూ హరిక, విఠల్ మాట్లాడుతూ వితరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళావతి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన హరికిషన్ బస్వంత్‌రావ్ పాటీల్ గతఏడాదీ మరణించారు. ఆయన జ్ఞాపకార్థం వారి కుటింబికులు శక్తినగర్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు సర్పంచ్ చేతుల మీదుగా పంపిణి చేశారు. డోన్గాం ఎంపీపీఎస్ పాఠశాలకు బీరువాను ఉచితంగా బీఆర్ఎస్ నాయకుడు గజిరే రాజు వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లు, ఉపాద్యాయులు సాదీయా, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



శక్తినగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో బ్యాగుల పంపణి

ఇంటిగ్రేట్ మార్కెట్ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలో రెండు కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేట్ మార్కెట్ పనులను శనివారం ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ జీవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యత ఉండాలని పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుందని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

కీచక అధ్యాపకుడిని తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న దాసరి నరేష్ కుమార్ (పిజిటి) అనే లెక్చరర్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, రాత్రి పూట అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిస్తూ వీడియో కాల్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్న చేసినటువంటి లెక్చరర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అడిషనల్ డైరెక్టర్‌కు స్పీడ్ పోస్ట్ చేసినట్లు శనివారం తెలిపారు. అతని పై చర్యలు తీసుకోకుండా మరో చోటికి డిప్యూటేషన్‌పై పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి చీడపురుగులను వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏ.ఓ కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ రోహిత్, కృష్ణ, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

93 పశువులకు వైద్య చికిత్సలు



పశువులకు చికిత్స అందజేస్తున్న పశువైద్యులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో శనివారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 93 పశువులకు చికిత్సలు నిర్వహించినట్టు పశువైద్యాధికారి రామ్ చందర్ తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పశు వైద్య విద్యాలయం తరపున ప్రత్యేక శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జంతువుల పట్ల దయ, కరుణ లాంటి ప్రవర్తనలు అలవర్చుకోవాలని సూచించినట్టు తెలిపారు. శిబిరంలో 58 పశువులకు గర్భకోశ చికిత్సలు, 25 పక్షులకు సాధారణ చికిత్సలు, 10 దూడలకు నట్టల నివారణ మందు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సాయిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులగం సాయి రెడ్డి, పాల కేంద్రం అధ్యక్షులు గడ్డం కిష్టారెడ్డి, ప్రొఫెసర్ నాగరాజు, విశాల్, మండల పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ, సాంకేతికతను జోడిస్తే..

వచ్చేతరంలో వ్యవసాయం పండుగే

- యువత సాగు వైపు చూసే అవకాశం ఉంది
- ఐదు విప్లవాలు సాధిస్తే మరెన్నో ఫలితాలు
- మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వచ్చే తరం వ్యవసాయంలో ఆసక్తి కనబరచాలి అంటూ, వ్యవసాయానికి అనుసంధానమైనటువంటి శాస్త్రీయ, సాంకేతికతలు జోడిస్తే రైతులు యువత ముందుంటుందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రైతుల పిల్లలు రైతులు కావడానికి ఇష్టపడడం లేదని వ్యవసాయానికి శాస్త్రీయత సాంకేతికత జోడిస్తే మరెన్నో మంచి ఫలితాలను సాధించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నిజామాబాద్ నగరంలోని ప్రాంతంలో బోర్గం ప్రాంతంలో గల భూమారెడ్డి కన్వెన్షన్‌లో 'కాకతీయ సాండ్ బాక్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. సాగులో టెక్నాలజీ, శాస్త్ర సాంకేతికతపై కీలక ఉపన్యాసం చేశారు.



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

ఆనాడు రైతులు పంట పండించడానికి పుట్టెడు దుఃఖమును ఉండేవారని.. ఇప్పుడు పుట్ల కొద్దీ పంట పండిస్తున్నారని అన్నారు. పంటలు పండించుటకు 2014లో తెలంగాణ రాష్ట్రం నుండి 68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణ జరిగిందని, ప్రస్తుతం 3.5 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం రాష్ట్రంలో పండిస్తున్నారు అని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను దేశంలోని 26వ స్థానం నుండి మూడో స్థానానికి వచ్చినట్టు తెలిపారు. ఇంతటి వ్యవసాయ ఉత్పత్తులు పెరగడానికి వ్యవసాయానికి శాస్త్రీయత, సాంకేతికత జోడిస్తే ఇంతటి ఫలితాలు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాదులో త్రిబుల్ ఐటీ సంస్థ తో నిర్వహించిన సమావేశంలో జరిగిన అంశాలను తెలుపుతూ రైతుల పిల్లలు రైతులు కావడానికి ఇష్టపడడం లేదు అని వ్యవసాయానికి శాస్త్రీయత సాంకేతికత జోడిస్తే మరెన్నో మంచి ఫలితాలను సాధించే అవకాశాలు ఉన్నాయని అదే విధంగా మన రాష్ట్రంలో వ్యవసాయానికి రైతుకు అనుబంధంగా ఉండే పనులను చేసుకునే 60 నుంచి 60 శాతం మంది వరకు ప్రజలు వాటిపైనే ఆధారపడి ఉంటున్నారని ఇందుకు ఐదు రకాల విప్లవాలు అవసరమనే విధంగాను ఆ ఐదు రకాల విప్లవాలను వివరించారు. ఒకటి హరిత విప్లవం వ్యవసాయాన్ని విస్తీర్ణం చేస్తూ వంట పొలాలను సాగు చేస్తు, హరిత విప్లవం, సస్య విప్లవం అని, రెండవది నీలి విప్లవం దీని ద్వారా నీటిని, చెరువులను బాగు చేసుకోవడం నీటితో చేపలు, రొయ్యలు పెంపొందించడం, ఫాం పాంట్స్ లో చేపలు రొయ్యలు ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో దొరికే విధంగా శ్రీరామ్ సాగర్, రాజరాజేశ్వర సాగర్ వంటి నీరు ఉన్న ప్రాంతంలో చేపలు పెంచనున్నట్టు తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో రాజేశ్వర సాగర్‌లో ఇతర దేశాలకు సంబంధించిన వారు వచ్చి తలపియా అనే చేపను పెంచుటకు 1000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసి 3000 మందికి ఉద్యోగాలను కల్పించారని అన్నారు. నీలి విప్లవంలో ఇతర దేశానికి సంబంధించిన ఇంగ్లాండ్ ఫిష్ అనేదానికి మంచి ప్రాముఖ్యత ఉందని గుర్తు చేశారు. మూడవ విప్లవం గులాబీ విప్లవం ఇది పశు సంపద, జీవ సంపదతో ఎంతో ముడిపడి ఉందని దీని ద్వారా మాంస ఉత్పత్తులు ఎంతో అభివృద్ధి చెందుతున్నా యని, గొల్ల, కురుమ, యాదవులకు గొర్రెల పెంపకాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని తద్వారా ప్రజలకు ఉపాధి లభిస్తుందని, మాంస ఉత్పత్తులు పెరిగాయని 11 వేల కోట్లతో ప్రారంభమైన ఈ పశు సంపద, జీవ సంపద తో ఇతర రాష్ట్రాల నుంచి గతంలో మాంసం కొనుగోలు చేసేది, ప్రస్తుతం తెలంగాణ నుండి ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామని అన్నారు. నాలుగో విప్లవం శ్వేత (వైట్) విప్లవం దీని ద్వారా పాల ఉత్పత్తులు పాల పదార్థాలు అభివృద్ధి చెంది యువకులకు ప్రజలకు మేలు చేకూరుతుందని అందులో భాగంగానే విజయ డైరీ నుండి ప్రభుత్వం డివిడెంట్ ని పొందినట్టు తెలిపారు. పాడి, పంట రెండు కలిసి వస్తే నే రైతు ఆదాయం పెంపుతుందని అన్నారు.

ఐదవ విప్లవం యెల్లో (పసుపు) విప్లవం ద్వారా వంట నూనెలు ఆయిల్ ఫామ్స్ సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఇతర దేశాల నుండి 78 శాతం దిగుమతి చేసుకోవడం జరుగు తుందని, తద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ఆయిల్ ఫామ్ సాగు చేయడంతో తెలంగాణ రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు దేశాలకు పామాయిల్ సాగుతో ఇతర రాష్ట్రాలకు దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు ఉంటాయని వివరించారు. దానిని ఇతర దేశాలకు పంపించే విధంగా ఎగుమతి చేసే దిశగా ఎదగాలంటే ప్రస్తుతం 20 లక్షల ఎకరాలకు లక్ష్యంగా పెట్టుకొని ఆయిల్ ఫామ్ పంట సాగును పెంచేప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు.

'తెలంగాణ రాష్ట్రంలో కమతలు చిన్నగా ఉంటాయి, అమెరికా వంటి దేశంలో కమతలు చాలా పెద్దగా ఉంటాయి. అక్కడ పంట పొలాలలో పురుగుమందులు చల్లడానికి డ్రోన్‌లను ఉపయోగిస్తారని, మన రాష్ట్రంలో చిన్న కమతాలు ఉంటాయి, రెండు రెండున్నర ఎకరాలకు ఒక్కోక రైతుకు పొలాలు ఉంటాయని, కొందరు రైతులు కలిసి ఒక డ్రోన్ ద్వారా పురుగుమందులను చల్లుకునే అవకాశం ఉంటుందని, దావోస్‌లో ఒక సంస్థతో కలిసినప్పుడు మందులను చల్లడానికి రెండు మూడు వేల మంది పిల్లలకు ట్రైనింగ్ ఇచ్చి పురుగు మండలం చల్లే శిక్షణ తరగతులు నేర్పిస్తున్నట్టు' తెలిపారు.

రైతులు ధాన్యం పండించడమే కాకుండా వాటిని ప్రాసెసింగ్ చేయడానికి ప్రాసెసింగ్ యూనిట్లను తెలంగాణ రాష్ట్రం మొత్తంలో 10వెల ఎకారలలో 16 యూనిట్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, బాల్కొండ నియోజకవర్గంలో స్పైస్ పార్క్ ను, ఆర్మూర్ నియోజకవర్గం లో లక్కంపల్లిలో సేజ్ ఏర్పాటు చేయడం జరిగిందని, నిష్ణాతులైన విద్యార్థులకు ఇంట్రెస్ట్ ఉన్న వారికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని అవకాశం రాయితీలతో పెట్టుబడి పెట్టుకుని అవకాశం కల్పిస్తారని అన్నారు.

కాకతీయ సాండ్ బాక్స్ ద్వారా ఏడెనిమిది జిల్లాలలో 300 గ్రాముల రైతులు బీసీఐ ద్వారా పత్తి పంటను పండించి శాస్త్రీయ సాంకేతికతను అందిపుచ్చు కుంటున్నందుకు అదేవిధంగా ముందుకు వెళ్తున్నందుకు రైతులకు ధన్యవాదాలు అని అన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

'కంటివెలుగు'తో కవరింగ్

- మురుగు కనిపించకుండా అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు



ఎల్లమ్మగుట్ట కమాన్ వద్ద మురుగు ఏర్పడకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ..



ఫ్లెక్సీ వెనుక పేరుకుపోయిన ఉన్న మురుగు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలో కేటీఆర్ పర్యటనలో భాగంగా రోడ్లను అందంగా ముస్తాబు చేయగా.. మురుగను విస్మరించారు. నగరంలోని ఎల్లమ్మ గుట్ట కమాన్ దాటిన తర్వాత హైదరాబాద్ వెళ్లే రోడ్డు పక్కన మురుగునీటితో అపరిశు భ్రంగా ఉంది. డ్రయినేజీ నిర్మించకపోవడంతో చెత్తాచెదారం నిండిపోయింది. ఈ దారి గుండా వెళ్లే క్రమంలో మంత్రి దృష్టికి వెళ్లకుండా కంటివెలుగు కార్యక్రమ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. మురుగునీటిని శుభ్ర పరిచి డ్రయినేజీ నిర్మించాల్సింది పోయి.. ఇలా ఫ్లెక్సీలు అడ్డుగా పెట్టడం సరికాదని పెదవి విరుస్తున్నారు.

రెడ్డిపేట్ సబ్ స్టేషన్‌కు బ్రేకర్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని స్కూల్ తండా, జగదాంబ తాండ, బట్టు తండాలకు సరఫరా అయ్యే విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఒకటే బ్రేకర్ ఉండటం వలన రైతులకు ఇబ్బంది కలుగుతుందని, మరో బ్రేకర్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి కోరారు. శనివారం ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి విద్యుత్ అధికారి ఎస్ఈని కలిసి వినతిపత్రం అందజేశారు. వచ్చే వేసవికాలం రైతుల పంటలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు, ఇబ్బందిగా ఉన్న బ్రేకర్ ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు రాజు నాయక్, రెడ్డి నాయక్, బీఆర్ యస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ భూమి కబ్జా చేసి నిర్మాణాలు

- మాజీ ఉపసర్పంచ్‌పై అడిషనల్ కలెక్టర్‌కు ముత్యంపేట్ వాసుల ఫిర్యాదు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామ మాజీ ఉప సర్పంచ్ శిరీష్ గౌడ్ ప్రభుత్వ పాఠశాల భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు శనివారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్య ప్రకాష్, గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కాటిపల్లి వెంకట రాంరెడ్డి పేరున 638/ఆ సర్వే నంబరులో ఉన్న 1.01 ఎకరాల భూమితో పాటు అదే గ్రామానికి చెందిన ఎం.అంజయ్య పేరున 638/ఆ సర్వే నంబరులో ఉన్న 1.10 ఎకరాల భూమిని 63 సంవత్సరాల క్రితం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చారని, ఆ భూమి మధ్యలో నుంచి రోడ్డు, పాఠశాలకు స్థలం పోగా ఇప్పుడున్న 21 గుంటల భూమి పాఠశాలకు గ్రౌండ్ గా ఉపయోగిస్తున్నారని తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ శిరీష్ గౌడ్ పదవిలో ఉన్న సమయంలో తన భార్య



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు


ముత్తగారి రోజా పేరున 21 గుంటల భూమిని నకిలీ కాగితాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, అందులో ఇంటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఆ భూమి పహాని రికార్డులో పాఠశాల స్థలం పేరున ఉందన్నారు. ఈ విషయమై శిరీష్ గౌడ్ ను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా అతనికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. పాఠశాల స్థలం కబ్జా విషయంలో గ్రామస్తులంతా ఒక్కటిగా ఉన్నారని, మాజీ ఉపసర్పంచ్ శిరీష్ గౌడ్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.. గ్రామంలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందని, అలా జరగకుండా వెంటనే నిర్మాణాలను తక్షణమే ఆపించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

నిధులు దుర్వినియోగంపై విచారణ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో డిజిటల్ కీ సహకారంతో నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నట్టు డీఎల్‌పీవో సురేందర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏడు గ్రామపంచాయతీలో సంబంధించిన కార్యదర్శులు మరియు ఇతర గ్రామపంచాయతీలలోని కార్యదర్శులు తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న ప్రశాంత్ డిజిటల్ కీ సాయంతో 2,96,400 రూపాయలు గుట్టుచప్పుడు కాకుండా తన సొంత ఖాతాలోకి జమ చేసుకొని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. నిధుల దుర్వినియోగంలో ఎంపీఓకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్ డిజిటల్ కీ సాయంతో నిధులు కాజేసీ నాలుగు రోజుల నుండి విధులకు రాకపోవడంతో అనుమానం వచ్చి కంప్యూటర్ లాగిన్ ఓపెన్ చేయగా అసలు విషయం బయట పడింది. దీంతో ఎంపీఓ ప్రభాకర్ చారి కార్యదర్శులతో కలిసి శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్ పై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోనికి పాల్పడిన మాట వాస్తవమే అన్నారు ఏడు గ్రామపంచాయతీలో చెందిన కార్యదర్శుల వివరణను ఆయన తీసుకున్నారు నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యే.. రూ.50 కోట్లకు అమ్ముడుపోయాడు



మాట్లాడుతున్న వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజల చెందాలతో, కాంగ్రెస్ పార్టీ బీఫామ్ పై గెలిచి, అభివృద్ధి పేరుతో, అధికార పార్టీకి రూ.50 కోట్లకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ అమ్ముడుపోయాడని ఎల్లారెడ్డి నియోజ కవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని పోసానిపేట్, గోకుల్ తాండ, గిద్ద గ్రామాల్లో మూడో రోజు హాత్ సే హాత్ జోడో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అధికారంలో లేకున్నా ప్రజల సౌకర్యార్థం ఉచిత బస్సు, అంబులెన్స్ ను, డాక్టర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నామని, ప్రజల బతుకులు మారుస్తామని, కల్లిబొల్లి కబుర్లు చెప్పి టీఆర్ఎస్ నాయకుల బతుకులు బాగుపడ్డాయని ఎద్దేవ చేశారు. మల్లన్న గుట్టకు తాగునీటిని తెచ్చిన ఘనత మాజీ మంత్రి షబ్బీర్ అలీదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దళితులకు మూడెకరాల భూమి, అర్హులైన ప్రతి ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రూ, 3000 పింఛన్, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్లో రూ, 500 కు అందిస్తున్న సిలిండర్లు, చతిస్గడ్ లో వడ్లకు అందిస్తున్న రూ, 2500 అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి, పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా రథ సప్తమిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర కళ్యాణం వేదమంత్రాలతో నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించి పెద్ద మొత్తంలో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు కమిటీ అధ్యక్షులు గాండ్ల నాగరాజు పేర్కొన్నారు. కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి, దూపల్లి తదితర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ మహోత్సవంలో మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కమిటీ సభ్యులందరూ ఐకమత్యంతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులు జి. నాగరాజ్, ఉపాధ్యక్షులు కిన్నెర మోహన్, కార్యదర్శి గంగోని శంకర్, కోశాధికారి బాలయ్య, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌తో అభివృద్ధి పనుల్లో బోధన్ మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-బోధన్



నిజామాబాద్ నగరంలో నూతనంగా 50 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఇందూరు కళాభారతి ఆడిటోరియం పనులకు శంకుస్థాపనకు చేయడానికి పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. అలాగే పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి అభివృద్ధి పనుల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో

రైతుల సంక్షేమం విస్మరణ

- కిసాన్ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- ఆర్మూర్‌లో రైతు సదస్సు



మాట్లాడుతున్న కోదండరెడ్డి, జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరించాయని కిసాన్ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ కోదండ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పెర్కిట్ ఎం.ఆర్ గార్డెన్‌లో పసుపు పంట మద్దతు ధరపై పసుపు రైతుల గోసపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే పసుపు పంటతో పాటు అన్ని పంటలనూ తామే కొనుగోలు చేస్తామని 2018 ఎన్నికల ప్రచారంలో జిల్లాలోని మోర్తాడ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చెప్పినారని, కొనుగోలు చేయకపోగా కనీసం ఒక్క పైసా కూడా బోనస్ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులకు ఏ రకమైన రాయితీలు కూడా ఇవ్వడం లేదని, పసుపు రైతులను ఆదుకోవడం కోసం స్పైసిస్ పార్కు ఏర్పాటు చేస్తాం.. దీనివలన పసుపు రైతులకు ధర వస్తుంది అని చెప్పిన ఏమి ఒరగలేదని అన్నారు. తెలంగాణలో పసుపు రైతులను ఆదుకుంటామని జిల్లాలోని పడిగెల గ్రామ శివారు వేల్పూర్ రహదారి పక్కన 40 ఎకరాల 23 గుంటల్లో 2015లో స్పైసిస్పార్క్ నిర్మాణం చేస్తామని, దీనివలన పసుపు రైతులకు లాభం వస్తుందని తెలంగాణ ప్రభుత్వం చెప్పిందని 33 కోట్లు పెట్టి కాంపౌండ్ వాల్ కట్టిందే తప్పితే పసుపు రైతులకు లాభం శూన్యమని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని విషయాలు కేంద్ర ప్రభు త్వం మీదకు నొక్కుతుందని పసుపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, రాష్ట్ర బడ్జెట్లో ఒక్క రూపా యి కూడా కేటాయిస్తలేదని వివరించారు. గత నాలుగు సంవత్సరాల్లో పసుపు గురించి పార్లమెంటులో టీఆర్ఎస్ సభ్యులు ఒక్క ప్రశ్న కూడా అడిగినట్టు లేదని అన్నారు.

పార్లమెంట్ సభ్యుడివి కూతలేనా..?

2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో పసుపు బోర్డు, పంటకు మద్దతు ధర కావాలని ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ తెలివిగా పసుపు రైతుల పోరాట సెంటిమెంట్‌ను ఆసరా చేసుకొని గెలిచిన వెంటనే 'పసుపు బోర్డు, పసుపు పంటకు మద్దతు ధర ఇస్తానని లేకుంటే రాజీనామా చేస్తా'నని బాండ్ పేపరు రాసి డ్రామా చేసి గెలిచిన తర్వాత అనేక తప్పుడు హామీలిచ్చి రైతులను మోసం చేశాడన్నారు. పసుపు సాగు పెట్టుబడి ప్రతి సంవత్సరం పెరుగుతూ ఇప్పుడు 1,50,000 దాటిపోయిందని ధర మాత్రం పెట్టుబడులు పెరుగుతున్న స్థాయిలో పెరగడం లేదని చెప్పారు. దీనికి తోడు ప్రకృతి కూడా పగపట్టడంతో దిగుబడి కూడా అమాంతం పడిపోయిందని, 12 క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని ధర మాత్రం 5500 దాటడం లేదని అన్నారు. పసుపు రైతులకు గిట్టుబాటు కావాలంటే పసుపు బోర్డు ఒక్కటే మార్గమని, తెలంగాణలో అందులో నిజామాబాదులో ఎన్నో సంవత్సరం నుండి పసుపు బోర్డు కోసం ఉద్యమాలు నడుస్తున్నాయని ప్రభుత్వాలు పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పలు తీర్మానాలు..

ఈ సందర్భంగా సదస్సులో పలు తీర్మానాలు చేశారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15 వేలు ప్రకటించాలని, కేంద్రం లేదా రాష్ట్రం పంట కొనుగోలు మార్క్‌ఫెడ్, నాఫెడ్, స్పైసెస్ బోర్డ్ చెయ్యాలని, పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని, పసుపు పంట విస్తీర్ణం పెంచడా నికి కేంద్రం కనీసం 10 వేల కోట్లు, రాష్టం కనీసం వెయ్యి కోట్లు కేటాయించాలని, కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రానికి 10 కోట్లు కేటాయించాలని, పసుపు రైతుల పంట ఖర్చుకు తగ్గ ఆదాయం ఇవ్వాలని, పసుపు ధర స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌తో సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయుల బదిలీలలో మెడికల్ గ్రౌండ్ సర్టిఫికెట్లు అవసరమైన వారు, ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చేవరికి తొందరగా పరీక్షలు నిర్వహించి ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ఇప్పించాలని, పరీక్షలు నిర్వహించే డాక్టర్లు అందరూ అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ కుమార్‌తో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ సమావేశం అయ్యారు.

భారత్ జాగృతి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

భారత్ జాగృతి ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మక్కల సాయినాథ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఏఈఆర్వోగా ఎంపికైన తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌ను పూలదండ శాలువాతో సన్మానం చేసి స్వీట్లు తినిపించారు. సన్మాన కార్యక్రమంలో జాగృతి పట్టణ అధ్యక్షుడు నాయుడు, యూత్ అధ్యక్షుడు రాకేష్, జాగృతి యూత్ నాయకులు భూమేష్, శ్రీను సాయికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కోటగిరి

బాన్సువాడ నియోజకవర్గంలో దళిత ప్రభుత్వ ఉద్యోగులపై భారతీయ జనతా పార్టీ నాయకులు పలు రకాలుగా దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురిచేయడాన్ని ఖండిస్తూ పోతంగల్ మండలంలోని హంగర్గపారం గ్రామంలో శనివారం గ్రామంలో దళిత నాయకులు బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏజాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును వినియోగించుకోవాలి

- ఏపీఎం రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కంటి వెలుగు పథకాన్ని వినియోగించుకోవాలని ఏపీఎం రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య సమావేశంలో జెండర్ ప్రతిజ్ఞ చేయించి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు, జిల్లా సమైక్య కార్యదర్శి వనిత అధ్యక్షతన మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మహిళ జెండర్ ప్రతిజ్ఞను అనుసరించాలని, 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు మాత్రమే పెండ్లి చేయాలని, ఆడపిల్లలను సక్రమంగా చదివించాలని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా బ్యాంకు లింకేజీ పంపిణీ, రికవరీ, ఐబీ అంశాలు, న్యూ ఎంటర్‌ప్రైజెస్ గ్రౌండింగ్, అప్పు మంజూరు, కంటివెలుగు తదితర విషయాలు చర్చించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలి

- తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు సుబోదు అన్నారు. శనివారం పట్టణ తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని, రానున్న బడ్జెట్‌లో విద్యారంగానికి, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు, కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో విద్యకు కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 30శాతం నిధులు, కేంద్ర ప్రభుత్వం 10శాతం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు చోటు తదితరులు పాల్గొన్నారు.

లయోలా పాఠశాలలో ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్



తయారుచేసిన ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని లయోలా హైస్కూల్లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ సందర్శకులను ఆకట్టుకుంది. విద్యార్థులు తయారుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు, శాస్త్రీయ ప్రయోగాలు ప్రదర్శించారు. విద్యార్థులు తమ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించడమే గాకుండా, శాస్త్రీయ జీవన విధానాన్ని వివరించారు. విద్యార్థులు ఒక ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లను రూపొందించారు. మానవుని శరీరంలో ఉండే భాగాలను చూపించే విధంగా ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ప్రతి సంవత్సరం తమ పాఠశాలో విద్యార్థులచే సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం 170 రకాల ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, నిజాముద్దీన్, అనిల్, మాధవరావు, రేఖ, సుస్మిత, లావణ్య స్వాతి, అయాతి, సుమలత, మాధవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్‌లో కేటీఆర్ పర్యటన అడ్డుకుంటారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌ను తెల్లవారుజామున అక్రమంగా అరెస్ట్‌చేసి నాలుగవ టౌన్‌కు తరలించారని, వారిని వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కె.మనోజ్, నగర నాయకులు వినయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్ హాస్టల్ వద్ద ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కేవలం కమీషన్స్ కోసమే నూతనంగా కళాభారతి నిర్మిస్తున్నారని, తెలంగాణ బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి 200 కోట్లు, జిల్లాలో మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. నిజామాబాద్‌లో అనేక సమస్యలు విద్యారంగంలో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌరవ్, ఉదయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ఎంపికలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలను పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. గాంధీనగర్ శివారులో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన మణికంఠ, రిత్విక్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులు వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు పట్టణంలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రేణుక ఎల్లమ్మ ఐదో వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని మంథని గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఐదో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పుర వీధుల గుండా పల్లకి సేవ కార్యక్రమం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రూ.3వేల వేతన జీవోను విడుదల చేయాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో మధ్యాహ్నం భోజన కార్మికులకు రూ.3000 వేతనం చెల్లిస్తానని హామీఇచ్చారని, ఈ మేరకు వేతన జీవోను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. శనివారం వర్ని బాన్సువాడ ప్రధాన రహదారిపై మధ్యాహ్నం భోజన కార్మికులు గంటపాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్యాహ్నం భోజన కార్మికులకు 3000 జీవోను వెంటనే విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. అధిక ధరలు పెరిగినప్పటికీ మధ్యాహ్నం భోజనం కార్మికులు పాఠశాలలో విద్యార్థులకు అప్పులు చేసి భోజనాన్ని అందించారని అలాంటి కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి నన్నేసాబ్, సాయిబాబు, సురేష్, మధ్యాహ్న భోజన కార్మికులు అంజలి, సవిత, మేఘన, షైహిమ, సత్తెమ్మ, శారద, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలికల, బాలుర క్రీడ నిజామాబాద్ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో విజయ్ హైస్కూల్‌లో శనివారం క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి బాలురు 90, బాలికలు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు 02-02-23 నుంచి 09-02-23వరకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి వారిని ఫిబ్రవరి 10తేదీ నుంచి 12వ తేదీ వరకు విజయ్ హైస్కూల్ ఆర్మూర్, నిజామాబాద్ జిల్లాలో జరిగే 41వ తెలంగాణ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్టిక్ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, కోశాధికారి రాజేశ్వర్, కృష్ణమూర్తి, సురేందర్, మాధురి, రమణమూర్తి, సురేష్, రామ్ సింగ్, ధరంపురి, వినోద్, జ్యోత్స్న, సంఘ సభ్యులు భాగ్య, భాగ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే శారీరకంగానూ మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటారని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. శనివారం డిచ్‌పల్లిలో వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహంలో ప్రత్యేక ఉచిత ఆరోగ్య శిబిరం, అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్య యాక్షన్ చూసుకుంటూ అవసరాల మేరకు పౌష్టికాహారం తీసుకోవాలని, సరియైన విటమిన్లు, ప్రోటీన్లు గల ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ శారీరకంగానూ, మానసికంగానూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే అది పరిపూర్ణమైన ఆరోగ్యంగా పరిగణించబడుతుందని తెలిపారు. సాధారణ వ్యాధులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ రాధిక, ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్తలు అరుణ, లక్ష్మీ, వనిత, సరిత విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుశ్రీఖ పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి శనివారం ఘనంగా సత్కరించారు. కేటీఆర్ నిజామాబాద్ నగరంలో విస్తృతంగా పర్యటించిన సంగతి విదితమే. బేగంపేట విమానాశ్రయం నుంచి మంత్రి కేటీఆర్‌తో కలిసి హెలికాప్టర్‌లో జీవన్‌రెడ్డి నిజామాబాద్ నగరానికి వచ్చారు. పాత కలెక్టరేట్ ఆవరణలో 50కోట్ల రూపాయలతో చేపట్టిన కళాభారతి భవనానికి మంత్రి కేటీఆర్ భూమిపూజ నిర్వహించిన కార్యక్రమంతో పాటు రైతులతో జరిగిన కేటీఆర్, ముఖాముఖిలోనూ ఆయనతో కలిసి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం సందర్శనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాలో జీవన్‌రెడ్డి స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయాన్ని పరిశీలించిన కేటీఆర్ జీవన్‌రెడ్డి చాంబర్‌లోకి వచ్చి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి పూలమాలలు, శాలువాతో కేటీఆర్‌ను సన్మానించారు.



కేటీఆర్‌ను సన్మానిస్తున్న జీవన్‌రెడ్డి

పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రేకులపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గడ్కోల్ గ్రామానికి చెందిన ఆర్మూర్ సుకేష్‌రెడ్డి రూ.20వేల విలువ గల కంప్యూటర్‌ను శనివారం బహుకరించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి విజ్ఞప్తి మేరకు సుకేష్‌రెడ్డి విరాళాన్ని అందించినట్లు తెలిపారు. కంప్యూటర్ అందించినందుకు సుకేష్ రెడ్డి, రాజారెడ్డిలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అర్జున్, శ్రీనివాస్, స్వాతి తదితరులున్నారు.